ప్రజాశక్తి

మంగళవారం 23 డిసెంబర్ 2025

క్వారీ తవ్వకాలు నిలిపివేయాలి

కలెక్టరేట్ వద్ద గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

పాచిపెంట మండలంలోని పి.కోనవలసలో సర్వే నెంబరు 531లో గల కొండపై క్వారీ త్వకాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నెలిపర్తి, శ్యామల గౌరీపురం, పనుకువలస, మంచాడవలసకు చెందిన గిరిజనులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సుమారు 350 కుటుంబాలకు చెందిన పశువులు, గొర్రెలు, మేకల మేతకు ఆ కొండ ఒక్కటే ఆధారమన్నారు. అంతేకాక మంచాడవలస సమీపాన కొండపై గోకర్ణేశ్వరస్వామి ఆలయం ఉందని, ఏటా వేలాది యాత్రికులు అక్కడికి వెళ్లి పూజలు చేస్తారని చెప్పారు. ఇటీవల జెసి పర్యవేక్షణలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో కూడా తాము ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తవ్వకాలు ఆపకపోతే తమ బతుకులు నాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డికి వినతిని అందజేశారు.

'ఉపాధి' చట్టం రద్దును ఉపసంహరించాలి

వామపక్షాలు, ప్రజా సంఘాలు డిమాండ్ • కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని రద్దు చేసి ఆ స్థానంలో జి రాం జీ పేరుతో తెచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని వామపక్ష పార్టీల, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం దేశవ్యాప్త పిలుపులు భాగంగా స్థానిక జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం జిల్లా కలక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డికి వినతిని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2005లో మహాత్మా గాంధీ పేరుతో వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి, కోట్ల మందికి హామీ లేకుండా గ్యారెంటీ అనే అంశాన్ని కాలరాశి, జాతిపిత మహాత్మా గాంధీ పేరు స్థానంలో జి రాంజీ పేరుతో తెచ్చిన నూతన చట్టం వల్ల 20 కోట్ల మంది గ్రామీణ పేదలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని అన్నారు. 2005 ఉపాధి హామీ చట్టం అమలు జరిగిన చోట గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనతో పాటు, సామాజిక న్యాయం, ఆర్థిక స్వాతంత్రంతో పాటు భూస్వామ్య వర్గాలతో పోరాడే శక్తి పేదలకు కల్పించిందని పేర్కొన్నారు. దానివల్ల లక్షలాది ఎకరాల పేదల భూమి అభివృద్ధి చెందిందని తెలిపారు. కరోనా సమయంలో దేశమంతా చిన్న భిన్నమైనప్పటికీ ఉపాధి హామీ చట్టం కోట్లాది మందికి ఉపాధి చూపించి అన్నం పెట్టిందని ఆంధ్రప్రదేశ్లో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని గుర్తు చేశారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన చట్టాన్ని మరింత బలోపేతం చేయాల్సింది పోయి ఆ చట్టంలోని కీలకమైన అంశాలు గ్యారెంటీ, 90:10ను రద్దు చేసి రాష్ట్రాలకు భారం పడేలా పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధంగా స్థానిక సంస్థలకు అధికారాలు లేకుండా పని హక్కును కాలరాస్తూ జి రాంజీ చట్టం చేయడం వల్ల కోట్లాదిమంది నిరుపేద కుటుంబీకులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. కావున 2005 మహాత్మా గాంధీ పేరున ఉన్న చట్టాన్ని యధావిధంగా అమలు చేసి ఆ చట్టాన్ని మరింత బలం చేస్తూ కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని అలాగే కేంద్ర బడ్జెట్లో రెండున్నర లక్షల కోట్లు నిధులు కేటాయించి, బిజెపి ప్రభుత్వం నూతనంగా నిర్ణయించిన జి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామస్వామి, వి.ఇందిరా, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మధరావు, సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనునాయుడు, సిపిఐ పి.రమణి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు పి.సంగం, సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా నాయకులు జీవ, సూరయ్య, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు భాష, రైతు సంఘం నాయకులు ఇవినాయుడు, ఎపి రైతు సంఘం నాయకులు బంటు దాసు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, జి.వెంకటరమణ, సిఐటియు జిల్లా నాయకులు గొర్లి వెంకటరమణ, బి.లక్ష్మి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.దుర్గాప్రసాద్, ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్ సింహాచలం, సంజీవ్, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికే ఆదర్శంగా మన్యం జిల్లా

ముస్తాబు, రెవెన్యూ క్లినిక్ రాష్ట్రవ్యాప్తంగా అమలు కావడం మనందరి విజయం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పరిపాలనలో, ప్రజా సమస్యల పరిష్కారంలో మన్యం జిల్లా రాష్ట్రానికే దిక్సూచిగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లా సాధించిన ప్రగతిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించిన నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టరెట్ పిజిఆర్ఎస్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు గజమాలతో సత్కరించారు. జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ముస్తాబు కార్యక్రమం అద్భుత ఫలితాలనిచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో పరిశుభ్రతను, క్రమశిక్షణను, సంస్కారాన్ని పెంపొందించే ఒక గొప్ప సంకల్పమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమ ఆవశ్యకతను స్వయంగా ముఖ్యమంత్రి గుర్తించి, దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని ఆదేశించడం మన జిల్లాకు దక్కిన గౌరవమని కొనియాడారు. నవంబర్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రతి నెలా జిల్లా మొదటి స్థానంలోనే ఉండేలా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే, జిల్లాలో విజయవంతమైన రెవెన్యూ క్లినిక్ విధానాన్ని కూడా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలన్నింటిలోనూ జిల్లా ప్రస్తుతం టాప్-5లో ఉందని, రాబోయే రోజుల్లో అన్ని విభాగాల్లోనూ అగ్రస్థానానికి చేరుకోవడమే మన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం స్థానిక లూథరన్ చర్చి పక్కన ఉన్న సమావేశ మందిరంలో "ఫ్యామిలీ ముస్తాబు" శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాధ్, డిఆర్ఒ కె.హేమలత, డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు సుధారాణి, ధర్మచంద్రారెడ్డి, రెవెన్యూ సిబ్బంది మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను గజమాలతో సన్మానిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

జనవరి 26న ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించే ఉపాధ్యాయులను గుర్తించి వారిని ప్రత్యేకంగా గౌరవించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి అన్నారు. విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తూ, వారి ఆరోగ్యం పట్ల అంకితభావంతో వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులకు రాబోయే జనవరి 26 గణతంత్ర దినోత్సవం వేడుకల్లో ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు ప్రకటించారు. విద్యాబోధనతో పాటు విద్యార్థుల శారీరక ఆరోగ్యం కూడా ముఖ్యమని, ఉపాధ్యాయుల చొరవతోనే ఇది సాధ్యమవుతుందన్నారు. ప్రతి పాఠశాలలోను ముస్తాబు కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేయాలని, విద్యార్థులు శుభ్రంగా ఉండేలా, చేతులు సబ్బుతోగాని, హ్యాండ్ వాష్‌తో గాని శుభ్రంగా కడుక్కున్నాకే భోజనం చేసేలా ఉపాధ్యాయులు పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు శుభ్రమైన దుస్తులు వేసుకుని పాఠశాలకు రావాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత, డిఆర్డిఎ పిడి సుధారాణి, హౌసింగ్ పిడి ధర్మ చంద్రారెడ్డి, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సింహాచలం

నలుగురు విద్యార్థులకు పచ్చకామెర్లు

ప్రజాశక్తి- పార్వతీపురం

గుమ్మలక్ష్మీపురం మండలంలోని దొరజమ్ము గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు పచ్చకామెర్లతో బాధపడుతున్నారు. ఈ మేరకు వారిని తల్లిదండ్రులే జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. పాఠశాల హెచ్ఎం, వార్డెన్‌లు పట్టించుకోలేదని ఆరపణులు వినిపిస్తున్నాయి. ఇటీవల ఇదే పాఠశాలకి చెందిన ఒక విద్యార్థి పిట్స్‌తో మృతి చెందాడు. ఈ మరణాన్ని పాఠశాల హెచ్ఎం, వార్డెన్‌లు గోప్యంగా ఉంచడం వివాదస్పదమైంది. ఆ వివాదం నుంచి తేరుకునేలోగా మరో నలుగురు విద్యార్థులు జిల్లా ఆస్పత్రిలో చేరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన 6,7 తరగతుల విద్యార్థులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన కద్రక విద్యాసాగర్, బచ్చల వసంత్, పువ్వల ధాన్యాలు, గంట ఫిరోష్ పచ్చకామెర్లు బారిన పడి ఆస్పత్రిలో చేరారు. నాలుగు రోజులు క్రితం జిల్లా ఆస్పత్రిలో చేరినా పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారు.

సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు హెచ్ సింహాచలం విద్యార్థులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో విద్యార్థులు ఎలా ఉన్నారో కనీసం తెలుసుకునే ప్రయత్నం కూడా పాఠశాల సిబ్బంది చేయడం లేదని అన్నారు. పాఠశాల హెచ్ఎం, వార్డెన్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు జిల్లా ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లా ఉపాధ్యాయులు క్రికెట్‌లో సత్తా చాటారు. ఇందులో భాగంగా పార్వతీపురం, సీతంపేట మండలాల ఉపాధ్యాయులు ఫైనల్ పోటీలకు వెళ్లి అర్హత సాధించారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఫైనల్ పోటీల్లో సీతంపేటజట్టు విజేతగా నిలిచింది. ఇరు జట్ల నుంచి ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు డిఇఒ పి.బ్రహ్మాజీరావు తెలిపారు.

మహిళా త్రోబాల్ విజేతలను అభినందిస్తున్న డిఇఒ బ్రహ్మాజీరావు

మహిళా త్రోబాల్ విజేతగా పాచిపెంట

జిల్లాస్థాయి ఉపాధ్యాయుల క్రీడాపోటీల్లో మహిళా విభాగంలో త్రోబాల్ పోటీల్లో విజేతగా పాచిపెంట, పురుషుల విభాగం క్రికెట్ పోటీల్లో విజేతగా పార్వతీపురం మండలాలు ఎంపికయ్యాయి. జిల్లాస్థాయిలో ఎంపికైన బృందాలు రాష్ట్రస్థాయి పోటీలకు విజయవాడ వెళ్లనున్నారు. కార్యక్రమంలో స్పోర్ట్ కో-ఆర్డినేటర్ ఎం.వాసుదేవరావునాయుడు, స్కూల్‌గేమ్స్ కార్యదర్శి సబ్బవరం మురళీ పర్యవేక్షణలో జరిగింది. న్యాయ నిర్ణీతలుగా చంటి, సత్య కైలాస్ వ్యవహరించారు.

5న ఎపిఎన్‌జిఒ తాలూకా యూనిట్ ఎన్నికలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అధికారుల సంఘం పార్వతీపురం జిల్లా బ్రాంచి ఎన్నికలు జనవరి 5న జరగనున్నాయని ఎన్నికల అధికారి టి.శ్రీధర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 3100 మంది ఉద్యోగులు సభ్యులుగా ఉన్న పార్వతీపురం యూనిట్‌లో 17 పోస్టులకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. పోటీ చేయదల్చిన ఉద్యోగులు ఈనెల 24న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎన్జీఒ హోంలో నామినేషన్ దాఖలు చేసుకోవచ్చునని తెలిపారు.

కుంకి ఏనుగులు ఎక్కడ?

- **ప్రకటనలకే పరిమితమైన పవన్ కల్యాణ్ హామీలు**
- **సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు**

ప్రజాశక్తి - కురుపాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికి 20 నెలలు పూర్తయినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుకాలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు తీవ్రంగా విమర్శించారు. సోమవారం కురుపాంలో ఆయన మాట్లాడుతూ ఏనుగుల బెడదతో రైతులు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. ఎన్నికల అనంతరం డిప్యూటీ సిఎం, పవన్ కల్యాణ్ సాలూరు పర్యటనకు వచ్చి కుంకీ ఏనుగు తీసుకొచ్చి ఈ జిల్లా నుంచి ఏనుగులను తరలిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఆ మాట ఇప్పటివరకు నెరవేరలేదని అన్నారు. కుంకీ ఏనుగులు ఎక్కడున్నాయి? అసలు కురుపాం నియోజకవర్గానికి తీసుకొచ్చి ఏనుగులను తరలిస్తారా? లేదా? తేల్చాలన్నారు. సీతానగరం మండలంలో ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు కోసం పేదలు తమ భూములు ఇవ్వడానికి కూడా అంగీకరించినప్పటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు పలువురు రైతులు ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది పంటలు నష్టపోయారని అన్నారు. ఇప్పటికైనా కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి స్పందించి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో మాట్లాడి ఈ ప్రాంతం నుంచి ఏనుగులను దూరప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని సిపిఎం తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు కూరంగి సీతారాం, మండంగి అడ్డమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గంగునాయుడు

పునర్విభజనపై రహస్యం ఎందుకో?

ప్రజాశక్తి మక్కువ

పంచాయితీల పునర్విభజన ప్రక్రియ సోమవారం ముగియడంతో మండలంలోని ఎన్ని పంచాయతీలు పునర్విభజనకు అంగీకరించాయన్న విషయాన్ని గోప్యంగా ఉంచడం వెనుక మరమ్మం ఏమిటో అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అన్ని పార్టీల సర్పంచులు గ్రామసభల్లో సమన్వయంతోనే ముందుకు కదిలే ఆస్కారం లేకపోవడంతో ఈ విషయాన్ని రహస్యపరిచినట్లు తెలుస్తోంది. మండలంలోని ప్రస్తుతం 21 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మక్కువ మేజర్ పంచాయతీ కాగా, కాశీపట్నం, పనసభద్ర, దబ్బగెడ్డ, శంబర, డి-సెర్లం పంచాయతీలు తరువాత వరుసలోకి వస్తాయి. ప్రభుత్వం పంచాయతీల పరిపాలనా సౌలభ్యం మేరకు పునర్విభజన చేయాలన్న ఆలోచనలో ఈ ప్రక్రియకు పూనుకుంది. అయితే పంచాయతీలు పునర్విభజనకు సంబంధించి గ్రామసభ తీర్మానం తప్పనిసరితో పాటు అన్ని వర్గాల సమన్వయం అవసరం ఎంతైనా ఉంది. రెవెన్యూ, పంచాయతీ, ఇంజినీరింగ్ సర్వే జనాభా, కుటుంబాల విభజన తదితర విభాగాల క్రోడీకరణ కూడా జోడించాల్సి ఉంటుంది. సోమవారం సాయంత్రానికి జిల్లా స్థాయికి సంబంధిత గ్రామపంచాయతీలకు సంబంధించి దరఖాస్తులను చేరవేసేందుకు చివరి రోజుగా నిర్ణయించారు. అయితే సోమవారం సాయంత్రానికి

రెండు పంచాయతీలకే తీర్మానాలు

ఎన్ని పంచాయతీల విభజనకు అంగీకారంగా ఉన్నాయన్న విషయాన్ని మాత్రం అధికారులు వెల్లడించలేదు. ఇదిలా ఉండగా మండలంలో కాశీపట్నం పంచాయతీ రెండు పంచాయతీలుగా, శంబర పంచాయతీ నుంచి వీరమాచి షెడ్యూల్డ్ గ్రామాన్ని వేరు చేయాలని దరఖాస్తు, పంచాయతీ తీర్మానం కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే దబ్బగెడ్డ పంచాయతీని అనసభద్ర కేంద్రంగా మరో పంచాయతీ చేయాలని, మార్కొండపుట్టి పంచాయతీ నుంచి గేశాల గ్రామాలను వేరే పంచాయతీగా చేయాలని, పనసభద్ర రెండుగా పంచాయతీని చేయాలని దరఖాస్తుల కూడా ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుత పంచాయతీ కేంద్రానికి సుమారు మూడు కిలోమీటర్ల పైబడి ఉండే ఎక్కువ గ్రామాలను వేరు చేసే అవకాశం ఉంది. అయితే మార్కొండపుట్టి పంచాయతీలోని ఎస్.పెద్దవలస కేంద్రంగా మరో పంచాయతీ ఏర్పాటు చేసేందుకు తీర్మానం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ విభజన ప్రక్రియలో రాజకీయ ఎత్తుగడలు కూడా జోడించే ఆస్కారం లేకపోలేదు. అందువల్లే అధికారులు కూడా రహస్యం పాటిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారుల తీరు మారాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యలను పరిష్కారంలో అధికారుల తీరు మారాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. నవంబర్‌లో అర్జీల పరిష్కారంలో రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రథమంగా నిలిచిందని, అదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. మీరు చేసే పరిష్కారం పట్ల ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరగాలని ఆ దిశగా అధికారులు వినూత్న రీతిలో కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 185 మంది ప్రజల నుంచి కలెక్టర్ వినతులను స్వీకరించి, సమస్యలను సావధానంగా విన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకే సమస్యపై ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని, ముఖ్యంగా రీ ఓపెన్ అవుతున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే వినతులకు నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అధికారి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రెవెన్యూ సమస్యలు వివరాలిలా ఉన్నాయి....

పార్వతీపురం మండలం పులిగుమ్మికి చెందిన టి.కమల సాగు చేసుకుంటున్న భూమికి అడంగల్, 1బి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరారు. అలాగే అడ్డాపుశీల గ్రామ పంచాయతీలో పట్టా నెం.18 సర్వేనెంబర్ 9(2) లో 0.50 సెంట్లు మెట్టు భూమిని మా అమ్మగారి పేరు మీద ఉన్న భూమిని తన పేరు మీద రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి పాసుబుక్ మంజూరు చేయాలని ఎం.కుశాల్ కోరారు. అలాగే కొత్తవలసకు చెందిన పి.వెంకటరమణ సర్వేనెంబర్ 263/5 లో 0-042 సెంట్లు మెట్టు భూమిని మా హక్కులు ఉన్నట్టు పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని వినతిని అందజేశారు.

మక్కువ మండలం చప్పబుచ్చమ్మపేట గ్రామ రెవెన్యూ పరిధిలోని 183- 7 సర్వేనెం.లో 1.44 విస్తీర్ణం భూమి ఉందని, 25 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి అడంగల్ మంజూరు చేయాలని చప్ప రాజేశ్వరమ్మ అర్జీ సమర్పించారు.

వీరఘట్టం మండలం నడుకూరుకు బి.భాస్కరరావు రెవెన్యూ పరిధిలో ఖాతా నెంబర్ 0-603 లో ఎ.2- 80 సెంట్లు భూమికు విద్యుత్ కనెక్షన్ కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. వీటితో పాటు మరిన్ని సాధారణ వినతులను కూడా స్వీకరించారు. . కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డిఆర్ఒ కె.హేమలత, ఎస్‌డిసిలు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీతంపేట ఐటిడిఎలో....

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో ఎపిఒ చినబాబు ఆధ్వర్యాన నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 27మంది అర్జీలను అందజేశారు. జన్నోడుగూడకు చెందిన నాగేశ్వరరావు టెంట్‌హౌస్‌కు రుణం ఇప్పించాలని, కొత్తగూడకు చెందిన దారుల్లి గొర్రెల లోను ఇప్పించాలని కోరారు. అలాగే గూడభద్రకు చెందిన చెల్లమ్మ హౌసింగ్ పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఇ రమాదేవి, డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి, సూపరింటెండెంట్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని పంచాయ తీలు, గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య పంచాయతీ వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పంచాయతీ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం శ్రీను మాట్లాడారు. అనేక పంచాయతీల్లో రూ.6వేలు జీతాన్ని ఆరు నెలలుగా కార్మికులకు చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా కార్మికులకు రావలసిన బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రతి కార్మికులకు రూ.4వేలు జీతంపై అదనంగా వైద్య ఖర్చుల నిమిత్తం చెల్లించాలని నిర్ణయించినా, నేటికీ ఎక్కడా అమలు చేయలేదని తెలిపారు. కార్మికులు ఇబ్బందుల నుంచి కార్మికులు బయటపడాలంటే వెంటనే పనిముట్లు సమకూర్చాలని డిమాండ్ చేశారు. అన్ని పంచాయతీల్లో కార్మికులందరికీ ఇళ్ల, స్థలాలు ఇల్లు ఇవ్వాలని కోరారు. ప్రతి ఏటా రెండు జతల యూనిఫారం ఇవ్వాలని కోరారు. పంచాయతీలు పారిశుధ్యం బాగా ఉండాలంటే కార్మికులకు అవసరమయ్యే సంవత్సర బడ్జెట్ ప్రభుత్వం ముందుగానే కేటాయించి జీతాలు సమస్య తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.శ్రీను, అప్పలస్వామి, తవిటీయ్య, ప్రసాదు, తవుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

క్రీస్తు బోధనలు మానవాళికి ఆదర్శప్రాయం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

క్రీస్తు బోధనలు, సందేశం యావత్ ప్రపంచానికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు (హైటీ) ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ పండుగ సమాజంలో ప్రేమ, శాంతి, సోదరభావాన్ని మరింత పెంపొందిస్తుందన్నారు. ఈ సెమీ క్రిస్మస్, క్రిస్మస్ వేడుకలను జిల్లా ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొవ్వొత్తులను వెలిగించి ప్రార్ధనలో పాల్గొని, క్రిస్మస్ కేకును కట్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర మాట్లాడుతూ క్రైస్తవత్వం అనేది కేవలం ఒక కులానికో, మతానికో పరిమితం కాదని, అది మానవాళి మొత్తానికి శాంతిని పంచే ప్రపంచ పండుగ అని అన్నారు. జిల్లా అభివృద్ధి, అధికారుల సంక్షేమం కోసం క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఎఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీస్తు అందించిన ప్రేమ, శాంతి, దయ ,క్షమాగుణం ప్రతి ఒక్కరూ తమ జీవితంలో పాటించాలని పిలుపునిచ్చారు. ఇతరులను క్షమించడమే కాకుండా, మన తప్పుల నుండి పాఠాలు నేర్చుకుంటూ మనల్ని మనం క్షమించుకుని సంతోషంగా జీవించాలని యువతకు మరియు ప్రజలకు సందేశాన్ని ఇచ్చారు.కార్యక్రమంలో జిల్లా డిఆర్ఒ కె.హేమలత, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి షరీఫ్, ఫాదర్ థామస్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ, వివిధ శాఖల అధికారులు, క్రైస్తవ మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే, క్రైస్తవ పెద్దలు

కరపత్రాలను విడుదల చేసిన క్రీడాకారులు, నిర్వాహకులు

26 నుంచి మెగా షటిల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండల కేంద్రంలోని ఎస్‌ఎఫ్‌ఆర్‌ఎస్ షటిల్ కోర్టులో ఈ నెల 26 నుంచి మెగా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తామని నిర్వాహకులు సింగూరు సురేష్, తోయక హర్షంత్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మెన్ డబుల్స్‌లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు రూ.10వేలు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేస్తామని ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 23లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మరిన్ని వివరాలకు 8331834518, 9490824392 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గరుగుబిల్లి మండలం చిలకం పంచాయతీ పరిధిలోని కారివలస, దత్తివలస, కొత్తచిలకం, పాతచిలకం గ్రామాలకు సంబంధించి సోమవారం పంచాయతీ విభజనపై గ్రామ సభ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని క్యాంపు కార్యాలయంలో కలిసి గ్రామస్తులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తచిలకం, పాతచిలకం ఒక పంచాయతీగా, దత్తివలస, కారివలస మరో పంచాయతీగా విభజించాలని కోరారు. దీన్ని మరి కొంత మంది వ్యతిరేకించారు.

పలువురికి పరామర్శ

ప్రజాశక్తి- పాలకొండ

పాలకొండ కోఆప్షన్ సభ్యులు కైలాస్ సాహూ తల్లి లక్ష్మీ సాహూ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, సిబిటియు జిల్లా అధ్యక్షులు దావల రమణారావు, టిడిపి పట్టణ అధ్యక్షులు గంట సంతోష్‌కుమార్, మాజీ కౌన్సిలర్ జవాబా, రైతు సంఘం నాయకులు బూడిత అప్పలనాయుడు సోమవారం కైలాస్ సాహూ కుటుంబాన్ని పరామర్శించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు సెల్‌ఫోన్లను పంపిణీ చేస్తున్న పిఒ రజనిదుర్గా

అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సోమవారం సిడిపిఒ జి. రజనిదుర్గా అంగన్‌వాడీ కార్యకర్తలకు సెల్‌ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు డిజిటల్ సాంకేతికత ఎంతో దోహదపడుతుందని, మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలు, పోషణ పథకాల అమలులో సెల్‌ఫోన్లు ఉపయోగంగా ఉంటాయని తెలిపారు. అంగన్‌వాడీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ మురళి

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసకారాదని ఎక్సైజ్ సిఐ డి.పద్మావతి అన్నారు. మండలంలోని జోగింపేట ప్రతిభ గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు వారి భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ కె.మురళి, ప్రిన్సిపల్ పి.ధర్మారావు,వైస్ ప్రిన్సిపల్ నాయుడు, ఎక్సైజ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర సోమవారం లబ్ధిదారునికి అందజేశారు. మండలంలోని జమదాలకు చెందిన గొట్టపు విద్యాసాగర్ కుటుంబ సభ్యులకు రూ.2,05,657 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

కలెక్టర్‌ను సన్మానించిన పడాల భూదేవి

ప్రజాశక్తి - సీతంపేట

మన్యం జిల్లా కలెక్టర్ ఎం.ప్రభాకరరెడ్డిని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి కలెక్టర్ కార్యాలయంలో దుశ్శాలువా, పూలబొకేతో ఘనంగా సన్మానించి అభినందించారు. కలెక్టర్ పాఠశాలల్లో ముస్తాబు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమాన్ని సిఎం చంద్రబాబునాయుడు భామినిలో జరిగిన ఎంపిటిఎం పర్యటించినప్పుడు చూసి కలెక్టర్‌ను అభినందించారు. అనంతరం కలెక్టర్ల సదస్సులో మన కలెక్టర్‌ను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ముస్తాబు కార్యక్రమం అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో సోమవారం నియోజకవర్గం స్థాయి ఖోఖో, వాలీబాల్, యోగా ఎంపిక పోటీలను నిర్వహించినట్లు నియోజకవర్గ ఇంఛార్జి బి. మాధవరావు తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో 40 పాఠశాలల నుంచి 400 మందికిపైగా విద్యార్థులు పాల్గొని పోటీ పడ్డారన్నారు. మంగళవారం కబడ్డీ, అథ్లెటిక్స్, చదరంగం పోటీలను నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

సైన్స్ ఫెస్ట్‌కి సర్వం సిద్ధం : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ ఆధ్వర్యంలో అన్వేష సైన్స్ ఫెస్ట్‌కి అంతా సిద్ధం చేసినట్లు ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫెస్ట్‌లో ఐటిడిఎ పరిధిలోని అన్ని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల నుంచి సైన్స్ ప్రాజెక్ట్‌లతో హాజరు కావాలని కోరారు. ప్రాజెక్ట్‌లను తిలకించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిఒ కోరారు.

ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - సాలూరు

విద్యార్థులు, వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు గణితంపై పట్టు సాధిస్తే విజయం వారినే వరిసుతందని రామానుజన్ మాథ్స్ క్లబ్ అధ్యక్షులు రంభ రజనీకాంత్ అన్నారు. గణిత శాస్త్రవేత్త రామానుజన్ జన్మదిన సందర్భంగా స్థానిక సాయి సూర్య పాఠశాలలో గణిత దినోత్సవం సోమవారం నిర్వహించారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ప్రాజెక్టులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ఉత్సాహంగా పిల్లలంతా 162 ప్రాజెక్టులు తయారుచేసి చక్కగా వివరిస్తున్నందుకు వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వ్యాపారవేత్త మండవిల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలను చక్కగా ప్రాజెక్టు తయారు చేయించినందుకు సిబ్బందిని అభినందించారు. ఉత్తమ ప్రదర్శనను ఇచ్చిన లంకహరి ప్రియ, మొల్లి దేదీప్య, బోనంగి ఓజేష్, డెక్కత హేమంత్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. నెంబర్ గేమ్స్‌తో అందర్నీ ఉత్తేజితులను చేసిన వరుణ్ సందీప్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు, హెచ్‌ఎం కోడూరు లక్ష్మి, సిబ్బంది గులిపల్లి మల్లేష్, ఈశ్వరమ్మ, రమ, అరుణ, గీత, విజయలక్ష్మి, కిషోర్, ప్రవళిక, యశోద పాల్గొన్నారు.

కురుపాం : గణిత మేదావి శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావు ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేఇస నివాళ్లు అర్పించారు. గణిత ఉపాధ్యాయిని ఎం.ప్రమీలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గణిత క్విజ్, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

గరుగుబిల్లి : మండలంలోని కొత్తూరు, గరుగుబిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శ్రీనువాస రామానుజన్ జయంతి కార్యక్రమాలు జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందక శంకరరావు, గణిత ఉపాధ్యాయులు డి.సుదర్శన రామానుజన్‌చిత్ర పటానికి పూలదండ వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం : గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు మండలంలోని తలవలరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎంఇఒ-2 ఆనందరావు పాల్గొన్నారు. అలాగే నడిమికెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, పివిఆర్ పురం మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో వివిధ రకాల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురుపాం: రామానుజన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట: మండలంలోని హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మేథ్స్‌డే ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. విద్యార్తులు అంకెల ఆకృతిలో ఆకట్టుకొనేలా నిర్వహించారు. గణితదినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ నీలవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని వివేకానంద పాఠశాలలో మేథ్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. పిహెచ్‌సి వైద్యాధికారి శివాజీనాయుడు గణితం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అలాగే విశ్వభారతి, తారకరామ పాఠశాలల్లోనూ గణిత దినోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళు,, కరస్పాండెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

మక్కువ: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సాలూరు: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నాయకులు

వీరఘట్టం: బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

పీసా చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

పీసా చట్టాలపై ప్రభుత్వం ఇచ్చిన శిక్షణను అధికారులు, సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీసా చట్టాలపై మూడురోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలను పూర్తిస్థాయిలో అధికారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణలో గిరిపుత్రులకు పీసా చట్టం ద్వారా వచ్చే సాంస్కృతిక, సహజ వనరుల, అటవీ ఉత్పత్తుల గ్రామసభల అధికారులు బాధ్యతలు, విధులు ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ, జిసిసి మేనేజర్ సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: మాట్లాడుతున్న ఎపిఒ చినబాబు

గుమ్మలక్ష్మీపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీసా చట్టంపై మూడురోజులు శిక్షణా కార్యక్రమంలో సోమవారం ముగిసింది. పీసా చట్టం అధికారులు, బాధ్యతలు, గ్రామసభ నిర్వహించాల్సిన కార్యక్రమాల కోసం ఎఎ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, కమిటీ అధికారాలు, బాధ్యతలను ఎంపిడిఒ ఐవి లక్ష్మి, శిక్షకులు కేదారిపురం పంచాయతీ కార్యదర్శి బిడ్డిక సురేష్ శిక్షణ అందించారు. ఇక్కడ నేర్చుకున్న విషయాలను గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సీతంపేట : పీసా చట్టంపై ఉపాధ్యక్షులకు, కార్యదర్శులకు అవగాహన ఉండాలని ఎపిఒ చినబాబు అన్నారు. స్థానిక ఐటిడిఎలో పీసా చట్టంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పీసా అధికారాల గురించి తెలుసుకోవాలన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణలో ఎంపిపి ఆదినారాయణ, ఎంపిడిఒ మిశ్రా, డిప్యూటీ ఎంపిడిఒ మోహనరావు, శ్రీనివాసరావు, కార్యదర్శులు రామకృష్ణ, శివాజీరాజా తదితరులు పాల్గొన్నారు

కొమరాడ: మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్

నా తల్లి మృతికి కారకులను శిక్షించాలి

ఎస్‌పికి మృతురాలి కుమార్తె వినతి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మక్కువ మండలం డి.శిర్లాంకు చెందిన ఆశా కార్యకర్త పొందూరు విద్యావతి మృతి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కుమార్తె జోత్స్న ఎస్‌పి మాధవరెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తల్లిపై స్థానిక టిడిపి నాయకులు డి.గౌరునాయుడుపై ర్యలు తీసుకోవాలని కోరారు. తన తల్లి ఆశా కార్యకర్తగా పనిచేసేదని, కులవివక్షతో టిడిపి నాయకులు తన తల్లికి పిట్నెస్ బాగోలేదని వైద్యాధికారులు విధులకు రానీయలేదన్నారు. పలుమార్లు అధికారులకు, గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణికి మొరపెట్టుకున్నా తన ఉద్యోగం ఇవ్వలేదని, దీంతో ఆమె మానసిక క్షోభకు గురైందని ఆమె తెలిపారు. తన తల్లి మరణానికి కారణమైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్‌పిని కోరారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

నిర్ధేశించిన సమయంలో ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధితుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ కలహాలు, సైబర్‌మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం పై ఫిర్యాదులను అందుకుని వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన 11 ఫిర్యాదులు అందుకుని బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎం. వెంకటేశ్వరరావు, డిసిఆర్‌బి సిఐ ఆదాం, ఎస్‌ఐ రమేష్‌నాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న ఎస్‌పి

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి - కురుపాం

వివాహ వయసు కాని పిల్లలకు పెళ్లి చేయడం నేరమని స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సౌమ్యా జోస్పిన్ అన్నారు. మండల న్యాయసేవా కమిటీ ఆధ్వర్యాన మండలంలోని సీతంపేటలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మగవారికి 21 ఏళ్లు, ఆడపిల్లలకు 18ఏల్లు పూర్తయిన మీదటే వివాహనం చేయాలన్నారు. పోలీసులు, న్యాయవాదులు, స్వచ్ఛంద సేవకులు, ఐసిడిఎస్ సిబ్బంది ఇలా అన్ని వర్గాల వారు బాల్య వివాహాల గురించి అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఇంకా బాల్యవివాహాలు నమోదవుతున్నాయన్నారు. కోర్టుల పరంగా వందరోజులు కార్యాచరణ చేపట్టి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ వివిధ వర్గాల వారి భాగస్వామ్యంతో బాల్య వివాహాల గూర్చి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. బాల్య వివాహాలు జరిగిన విషయం తెలిస్తే సమీప పోలీసు స్టేషన్‌లో రిపోర్టు చేయాలని న్యాయమూర్తి సూచించారు. స్థానిక ఎస్‌ఐ పి.నారాయణరావు సైబర్ నేరాలపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది బరాటం చంద్రమౌళి, లోక్‌అదాలత్ సభ్యులు జి.వెంకటరావు, పారా లీగల్ వాలంటీరు అంధవరపు కోటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, ప్రోగాం అధికారి ఎం.రమేష్‌కుమార్, కోర్టు సిబ్బంది పాలకొల్లు శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సౌమ్యా జోస్పిన్

అంతర పంటలు మేలు

ప్రజాశక్తి - పాచిపెంట

ఏక పంట విధానం కంటే బహుళ పంటల విధానం ఎంతో మేలని, దీనివల్ల అదనపు ఆదాయం రావడమే కాకుండా నేల ఆరోగ్యం బాగుంటుందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. విశ్వనాధపురం గ్రామానికి చెందిన రైతు గొర్ల దివాకర్ మొక్కజొన్నలో వేరుశనగ అంతర్ పంటగా వేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పప్పు దినుసులు, వేరుశనగ వేర్లపై బుడిపెలు ఉంటాయని, ఈ బుడిత పెలలో రైజోబియం అనే బ్యాక్టీరియా ఉండడం వల్ల గాలిలో ఉన్న నత్రజనిని భూమిలో పంటకు అందిస్తుందని రెంటాన్ అంతర పంటల వల్ల మిత్ర పురుగుల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. నేల పూర్తిగా కప్పి ఉంచడం వల్ల భూమిలో భూసారంగా పిలవబడే హ్యూమస్ శాతం పెరుగుతుందన్నారు. కావున రైతులు ఏకపంట విధానాలను విడనాడి బహుళ పంటలను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఎఎలు అశ్విని, లావణ్య, సిఆర్‌పి విజయ్, ఐసిఆర్‌పి కుమార్ పాల్గొన్నారు.

అంతర్ పంటగా వేరుశెనగను వేస్తున్న అధికారులు

రక్తదానంతోనే సమాజసేవ

ప్రజాశక్తి - కురుపాం

రక్తదానం చేయడం ద్వారా సమాజానికి చేసిన సేవ ఎంతో గొప్పదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో హెల్పింగ్ హేండ్ స్వచ్ఛంద సంస్థ,, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం రక్తదాన శిబిరానికి హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కర్నీ ఎమ్మెల్యే అభినందించి, రక్తదానం చేసిన వారికి పండ్లు, రొట్టెతో పాటు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండి పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమారస్వామి, మండల కన్వీనర్ కెవి కొండయ్య, పిఎసిఎస్ ఛైర్మన్ డొల్లు కిశోర్, టిడిపి నాయకులు, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కొనసాగిన పల్స్ పోలియో

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని తామరకండి, బుడ్డిపేట, లక్ష్మీపురం, బగంద్రవలస గ్రామాల్లో సోమవారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని న్విహించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి ఉషారాణి పిల్లలకు చుక్కలు మందు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం చుక్కలు వేయగా మిగిలిపోయిన పిల్లలందరికీ వారి నివాస ప్రాంతాలకు వెళ్లి చుక్కల మందు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ ఎస్.రమణ, పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

బలిజిపేట: స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో సోమవారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని స్టేట్ అసెస్మెంట్ టీమ్ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింట సర్వే తీరుని వైద్య సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిహెచ్‌సిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం. మాధురి, డి.క్రాంతికిరణ్మయి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గలావిల్లి, నార్మనాయుడువలస, గంగాడ గ్రామాల్లో డాక్టర్ రేవతి, డాక్టర్ రిషికుమార్ పర్యటించి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజలు తాము కొనుగోలు చేసే వస్తువులు, సేవల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నాణ్యమైన సేవలను పొందడం ప్రతి వినియోగదారుడి హక్కు అని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి హితవుపలికారు. సోమవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో వినియోగదారుల హక్కులు, ప్రమాణాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులు తాము చెల్లించే ప్రతి పైసాకు తగిన నాణ్యత, పరిమాణాన్ని పొందడం చట్టబద్ధమైన హక్కు అన్నారు. వస్తువుల్లో లోపాలున్నా లేదా సేవల్లో నాణ్యత లోపించినా వినియోగదారులు వినియోగదారుల ఫోరమ్‌లను, న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చన్నారు. ప్రభుత్వ శాఖల సిబ్బంది అంతా వినియోగదారుల హక్కులపై పూర్తి అవగాహన ఉండాలని, తద్వారా సామాన్యులకు ఈ విషయాలను చేరువ చేయాలని ఆయన సూచించారు. అనంతరం వినియోగదారుల చైతన్యం కోసం రూపొందించిన వివిధ రకాల పోస్టర్లను అధికారులు ప్రదర్శించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాధ్, డిఆర్‌ఒ కె. హేమలత, డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు సుధారాణి, ధర్మ చంద్రారెడ్డి, రెవెన్యూ సిబ్బంది మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కొయ్యానపేట గ్రామానికి చెందిన వేతనపల్లి సీతంనాయుడు(75) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 15న పురుగుల మందు తాగడంతో మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి కుటుంబీకులు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడని ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు.

అడుగడుగునా గోతులు

◆ప్రమాదాలు జరిగినా స్పందించని అధికారులు ◆ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్లైఓవర్ బ్రిడ్జితో, మండలంలోని పలు గ్రామీణ, జాతీయ రహదారులపై ఎక్కడకక్కడే గోతులు ఏర్పడడంతో ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరుగుతున్నా ఆర్ అండ్ బి అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎటువంటి సంబంధం లేనట్లు వ్యవహరించడం పట్ల ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొబ్బిలి నుంచి పార్వతిపురం ప్రయాణం చేసే జాతీయ రహదారిపై పాత బొబ్బిలి నుంచి లచ్చపేట మధ్యలో గోతులు ఎక్కడికక్కడ ఏర్పడ్డాయి. అలాగే కాశీపేట నుంచి చినబోగిలి మధ్య, చినబోగిలి రైల్వే ట్రాక్ నుంచి సీతానగరం బ్రిడ్జి వరకు ఎక్కడకక్కడ గోతులు ఏర్పడ్డాయి. అలాగే అక్కయ్యపేట నుంచి జోగింపేట, జోగింపేట నుంచి గుచ్చిమి మధ్య గోతులు ఉన్నాయి. అలాగే నర్సిపురం వరకు రోడ్లు ఎక్కడికక్కడే గోతులు కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ప్లై ఓవర్ బ్రిడ్జిపై ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరుగుతున్నా వాహనదారులు మృత్యువాతపడిన సంఘటనలు ఉన్నాయి. అయినా ఆర్ అండ్ బి అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకి నీరెత్తినట్లే వ్యవహరిస్తున్నారని, దీంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నప్పటికీ ఎటువంటి చర్యలు లేకుండా ఆర్ అండ్ బి అధికారులు ఉంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం రోడ్డు మరమత్తు పనులు చేస్తామని చెప్పడం తప్ప, ఆ తర్వాత ఎక్కడా పనులు చేపట్టిన దాఖలాల్లేవు. రెండు నెలల క్రితం అప్పయ్యపేటకు చెందిన సుధాకర్ మరణించినప్పుడు రోడ్డు మరమ్మతులు చేపడతామని అధికారులు చెప్పగా, నేటికీ పనులు చేపట్టలేదు. అంతేకాకుండా మూడేళ్ల క్రితం లక్ష్మీపురం, సీతానగరం గ్రామాలకు చెందిన వాహనదారులు ప్లై ఓవర్ బ్రిడ్జి పైనే ప్రమాదాలకు గురై మరణించిన సంఘటనలు జరిగాయి. నాలుగేళ్లుగా బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన లైట్లు కూడా వెలగడం లేదు. ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. ఇక క్రిస్మస్, సంక్రాంతి పండగలు వస్తున్నాయి. ప్రయాణికుల రాకపోకలు పెరిగే అవకాశాలుండడంతో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంది. కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు, ప్లైఓవర్ బ్రిడ్జి మరమ్మతు పనులు చేపట్టి, లైట్లు వెలిగించి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి ప్రయాణికులు, మండల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతుకు గురైన రోడ్డు